# శ్రీజ సరికొత్త చరిత్ర

## డబ్ల్యూటీటీ కంటెండర్‌లో సింగిల్స్ టైటిల్ కైవసం



లాగొస్ (నైజీరియా): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ ఈవెంట్‌లో తెలంగాణ యువ ప్యాడ్లర్ శ్రీజ ఆకుల సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ టోర్నీలో సింగిల్స్ టైటిల్ నెగ్గిన తొలి భారతీయ ప్యాడ్లర్‌గా రికార్డులకెక్కింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో శ్రీజ 4-1 (10-12, 11-9, 11-6, 11-8, 11-6)తో చైనా యువ సంచలనం డింగ్ యిజిపై నెగ్గి టైటిల్ కైవసం చేసుకుంది. ఇదే టోర్నీ మహిళల డబుల్స్‌లోనూ శ్రీజ-అర్చన ద్వయం 3-0తో భారత్‌కే చెందిన దియా-యశస్విని జంటపై గెలిచి విజేతగా నిలిచారు. పురుషుల డబుల్స్ ఫైనల్‌లో మానవ్ ఠక్కర్-హర్మీత్ దేశాయ్ ద్వయం 3-0 (11-8, 11-9, 11-8)తో ఒమొటయొ-సొలంకె (నైజీరియ) జోడీపై గెలిచింది.

# భారత్ క్లీన్‌స్వీప్

## మంధాన మూడో సెంచరీ మిస్



బెంగళూరు: స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను భారత మహిళల జట్టు 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఇప్పటికే సిరీస్ సొంతం చేసుకున్న హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. ఆదివారం బెంగళూరు వేదికగా జరిగిన నామమాత్రపు మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 215/8కే పరిమితమైంది. ఆ జట్టు సారథి లారా వోల్వార్ట్ (61) రాణించింది. దీప్తి శర్మ (2/27), అరుంధతి రెడ్డి (2/36) సఫారీలను కట్టడిచేశారు. ఛేదనను భారత్ 40.4 ఓవర్లలోనే (220/4) పూర్తిచేసింది. ఈ సిరీస్‌లో వరుసగా రెండు శతకాలు చేసిన ఓపెనర్ స్మృతి మంధాన (83 బంతుల్లో 90, 11 ఫోర్లు) తృటిలో మూడో శతకాన్ని చేజార్చుకున్నా మరో మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడింది. దీప్తికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', మంధానకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి. ఇరుజట్ల మధ్య ఈనెల 28న చెన్నై వేదికగా ఏకైక టెస్టు జరుగనుంది.

# జోర్డాన్ హ్యాట్రిక్

## ఇంగ్లండ్‌కు ఈజీ విక్టరీ



**టీ20 ప్రపంచకప్‌లో ఇంగ్లండ్ తరఫున తొలి హ్యాట్రిక్ జోర్డాన్‌దే..**

బార్బడోస్: ఇంగ్లండ్ స్టార్ పేసర్ క్రిస్ జోర్డాన్ (4/10) హ్యాట్రిక్‌తో విజృంభించడంతో పొట్టి ప్రపంచకప్‌లో యూఎస్ఏతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఈజీగా గెలిచి సెమీస్‌కు దూసుకెళ్లింది. జోర్డాన్‌తో పాటు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అదిల్ రషీద్ (2/13), సామ్ కరన్ (2/23) విజృంభించడంతో మొదట బ్యాటింగ్ చేసిన యూఎస్ఏ 18.5 ఓవర్లలో 115 పరుగులకే ఆలౌట్ అయింది. నితీశ్ కుమార్ (30) టాప్ స్కోరర్. అనంతరం ఛేదనను ఇంగ్లీష్ జట్టు 9.4 ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండానే ఛేదించింది. కెప్టెన్ జోస్ బట్లర్ (38 బంతుల్లో 83 నాటౌట్, 6 ఫోర్లు, 7 సిక్సర్లు) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడి మ్యాచ్‌ను ముగించాడు. హర్మీత్ వేసిన 9వ ఓవర్లో రెండో బంతికి సిక్సర్‌తో అర్ధ సెంచరీ పూర్తిచేసిన బట్లర్.. ఆ తర్వాత వరుస బంతుల్లో 6, 6, 6, 6 బాదాడు. ఈ విజయంతో గ్రూప్-బి లో ఇంగ్లండ్ 4 పాయింట్లతో దక్షిణాఫ్రికాతో సమంగా నిలిచినా నెట్ రన్ రేట్ మెరుగ్గా ఉండటంతో సెమీస్ చేరింది.. వెస్టిండీస్ -సౌతాఫ్రికా మధ్య సోమవారం జరిగే కీలక పోరులో భారీ తేడాతో గెలిచిన జట్టు సెమీస్‌కు అర్హత సాధిస్తుంది.

# అఫ్గాన్ అద్భుతః

**ఆస్ట్రేలియాపై చరిత్రాత్మక విజయం..**

## గుల్బాదిన్ సంచలన స్పెల్‌కు ఆసీస్ విలవిల

## కంగారూలను కాపాడని కమిన్స్ హ్యాట్రిక్

**సెమీస్ రేసు రసవత్తరం**



గుల్బాదిన్ (4/20)

**గతేడాది భారత్ వేదికగా ముగిసిన ఐసీసీ వన్డే వరల్డ్ కప్‌లో అఫ్గాన్ చేతిలో ఓటమి నుంచి తృటిలో తప్పించుకున్న కంగారూలు.. పొట్టి ప్రపంచకప్‌లో మాత్రం తోక ముడవక తప్పలేదు. ఏడున్నర నెలల తర్వాత ఈ రెండు జట్ల మధ్య ఆద్యంతం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ సమిష్టిగా రాణించి చరిత్రాత్మక విజయాన్ని నమోదుచేసింది. ఓపెనర్లు గుర్బాజ్, జద్రాన్ సమయోచిత ఇన్నింగ్స్‌కు తోడు స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకోవడంలో బౌలర్లు చూపిన పట్టుదలకు పటిష్ఠ ఆస్ట్రేలియా లొంగక తప్పలేదు. వన్డే ప్రపంచకప్‌లో మాదిరిగానే మ్యాక్స్‌వెల్ ఆసీస్‌ను ఒడ్డుకు చేర్చాలని చూసినా కాబూలీలు ఈసారి మాత్రం 'పట్టు' వీడలేదు. గుల్బాదిన్ సంచలన స్పెల్‌తో పాటు నవీనుల్ హక్ పేస్‌తో విజృంభించి ఆసీస్‌ను ఓడించడంతో గ్రూప్-1లో సెమీస్ రేసు మరింత రసవత్తరంగా మారింది.**

సెయింట్ విన్సెంట్: గత కొంతకాలంగా నిలకడైన ఆటతీరుతో అగ్రశ్రేణి జట్లను ఓడిస్తూ సంచలనాలు నమోదుచేస్తున్న అఫ్గానిస్థాన్ తాజాగా ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాకూ ఆ రుచి చూపించింది. కొద్దిరోజుల క్రితమే న్యూజిలాండ్‌కు షాకిచ్చిన ఆ జట్టు.. ఇప్పుడు ఆసీస్‌నూ ఓడించింది. సెయింట్ విన్సెంట్ వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను 21 పరుగులతో ఓడించి చరిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఆ జట్టు నిర్దేశించిన 149 పరుగుల స్వల్ప ఛేదనలో భారీ హిట్టర్లు కలిగిన ఆసీస్.. 19.2 ఓవర్లలో 127 పరుగులకే చేతులెత్తేసింది. గ్లెన్ మ్యాక్స్‌వెల్ (41 బంతుల్లో 59, 6 ఫోర్లు, 3 సిక్సర్లు) మినహా అంతా విఫలమయ్యారు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' గుల్బాదిన్ నయిబ్ (4/20), నవీనుల్ హక్ (3/20) పేస్‌కు ఆసీస్ నిలబడలేకపోయింది. మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గాన్.. రెహ్మనుల్లా గుర్బాజ్ (49 బంతుల్లో 60, 4 ఫోర్లు, 4 సిక్సర్లు), ఇబ్రహీం జద్రాన్ (48 బంతుల్లో 51, 6 ఫోర్లు) అర్ధ సెంచరీలతో కదం తొక్కడంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 148 పరుగులు చేసింది.

### నవీనుల్, గుల్బాదిన్ దెబ్బకు విలవిల:

ఛేదించాల్సిన లక్ష్యమేమీ పెద్దది కాదు. ఆసీస్ బ్యాటింగ్ లైనప్‌ను చూస్తే అసలు అది లెక్కలోకే రాదు. కానీ నవీనుల్ హక్ తొలి ఓవర్ మూడో బంతికే ప్రమాదకర ట్రావిస్ హెడ్‌ను క్లీన్ బౌల్డ్ చేసి కంగారుల వికెట్ల పతనానికి శ్రీకారం చుట్టాడు. కెప్టెన్ మిచెల్ మార్ష్ (12) వస్తూనే రెండు ఫోర్లు కొట్టినా.. నవీన్ 3వ ఓవర్లో మిడాఫ్ వద్ద నబీకి చిక్కాడు. ఇన్నింగ్స్ 6వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన సీనియర్ స్పిన్నర్ నబీ.. తొలి బంతికే వార్నర్ (3)ను వెనక్కిపంపాడు. ఈ క్రమంలో మ్యాక్స్‌వెల్‌తో జతకలిసిన స్టొయినిస్ (11) 5 ఓవర్ల పాటు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నా.. గుల్బాదిన్ రాకతో ఆసీస్ ఇన్నింగ్స్ రూపురేఖలు మారిపోయాయి. 11వ ఓవర్‌లో అతడు వేసిన షార్ట్ బాల్‌ను ఆడబోయిన స్టొయినిస్ కీపర్ గుర్బాజ్‌కు చిక్కడంతో 39 పరుగుల 4 వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ఇక ఆ తర్వాత వచ్చిన ఏ ఒక్క ఆసీస్ బ్యాటర్ రెండంకెల స్కోరూ చేయలేదు. సహచరులు వెనుదిరుగుతున్నా అర్ధసెంచరీ పూర్తిచేసిన మ్యాక్స్‌వెల్ సైతం గుల్బాదిన్ 15వ ఓవర్లో నూర్ అహ్మద్ అద్భుత క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. టిమ్ డేవిడ్ (2), మాథ్యూ వేడ్ (5) నిష్క్రమణతో ఆసీస్ ఓటమి ఖరారైంది.

### గుర్బాజ్, జద్రాన్ సూపర్:

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన అఫ్గాన్‌కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. పటిష్ఠమైన ఆసీస్ బౌలింగ్‌ను ఈ ఇద్దరూ సమర్థవంతంగా ఎదుర్కొని తొలి వికెట్‌కు శతాధిక భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. హెజెల్‌వుడ్, కమిన్స్, జంపా, స్టొయినిస్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లున్నా అఫ్గాన్ ఓపెనర్లు 15.5 ఓవర్ల దాకా బ్యాటింగ్ చేయగలిగారంటే ఈ ద్వయం ఎలా ఆడిందో అర్థం చేసుకోవచ్చు. బౌండరీలు, సిక్సర్లతో హోరెత్తించకున్నా ఈ ఇద్దరూ వికెట్‌ను కాపాడుకుంటూ వికెట్ల మధ్య వేగంగా పరుగెత్తారు. అర్ధసెంచరీల తర్వాత స్టొయినిస్ 16వ ఓవర్లో గుర్బాజ్ ఔట్ అవడంతో 118 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

**1**

**ఆస్ట్రేలియాతో ఇప్పటివరకూ ఆడిన 6 మ్యాచ్‌లలో అఫ్గాన్‌కు ఇదే తొలి విజయం.**

**సంక్షిప్త స్కోర్లు:**

**అఫ్గానిస్థాన్:** 20 ఓవర్లలో 148/6 (గుర్బాజ్ 60, జద్రాన్ 51, కమిన్స్ 3/28, జంపా 2/28). **ఆస్ట్రేలియా:** 19.2 ఓవర్లలో 127 ఆలౌట్ (మ్యాక్స్‌వెల్ 59, మార్ష్ 12, గుల్బాదిన్ 4/20, నవీనుల్ 3/20)

### కమిన్స్ బ్యాక్ టు బ్యాక్ హ్యాట్రిక్..



బంగ్లాదేశ్‌తో గత మ్యాచ్‌లో మాదిరిగానే అఫ్గాన్‌తోనూ పాట్ కమిన్స్ హ్యాట్రిక్ సాధించాడు. 18వ ఓవర్లో ఆఖరి బంతికి రషీద్ ఖాన్‌ను ఔట్ చేసిన అతడు.. చివరి ఓవర్ తొలి రెండు బంతుల్లో కరీమ్ జనత్ (13), గుల్బాదిన్‌ను ఔట్ చేసి బ్యాక్ టు బ్యాక్ హ్యాట్రిక్ సాధించాడు.

### రేసు రసవత్తరం!

అఫ్గాన్, ఆసీస్ మ్యాచ్ ఫలితం తర్వాత గ్రూప్-1లో సెమీస్ రేసు రసవత్తరంగా మారింది. ఆడిన రెండు మ్యాచ్‌లలో రెండింటినీ గెలిచిన భారత్ 4 పాయింట్లతో పాటు మెరుగైన నెట్ రన్‌రేట్ (+2.425)తో అగ్రస్థానంలో సెమీస్ రేసును దాదాపుగా ఖాయం చేసుకుంది. కానీ ఆడిన రెండు మ్యాచ్‌లలో ఒకటి నెగ్గిన ఆసీస్, అఫ్గాన్‌లో ఏ జట్టు సెమీస్ చేరుతుందనేది ఆసక్తికరం. కంగారూలు తమ తర్వాతి మ్యాచ్‌ను సోమవారం భారత్‌తో ఆడనుండగా అఫ్గాన్.. బంగ్లాతో తలపడనుంది. టీమ్ఇండియాపై ఆసీస్ ఓడి బంగ్లాపై రషీద్ ఖాన్ సేన గెలిస్తే అఫ్గాన్ నయా చరిత్ర సృష్టించినట్టే! ఒకవేళ ఆసీస్ భారత్‌ను ఓడిస్తే.. అప్పుడు బంగ్లాపై అఫ్గాన్ భారీ తేడాతో నెగ్గాల్సి ఉంటుంది. ఆ జట్టు నెట్ రన్ రేట్ (-0.650) కంటే ఆసీస్ (+0.223) మెరుగ్గా ఉంది. ఒకవేళ నేటి మ్యాచ్‌లలో అఫ్గాన్, ఆసీస్ రెండూ తమ ప్రత్యర్థులను ఓడిస్తే అప్పుడూ (మూడు జట్లూ 2 విజయాలతో సమానంగా) నెట్ రన్ రేట్ అత్యంత కీలకమవుతుంది.



# ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నగరంలో ఆదివారం జరిగిన ఒలింపిక్ డే రన్ ఉత్సాహంగా ముగిసింది. సుమారు ఐదు వేల మందికి పైగా రన్నర్లు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఆదివారం ఉదయం 7 గంటలకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి 8 బృందాలుగా మొదలైన రన్నర్లు ఎల్బీ స్టేడియం చేరుకుని పరుగు పూర్తిచేశారు. ఈ కార్యక్రమం ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. క్రీడారంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# రికర్వ్ జట్టుకు కాంస్యం

- వ్యక్తిగత విభాగంలో ధీరజ్‌కూ పతకం



అంటల్య: ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-3లో భారత ఆర్చర్ల పతకాల వేట కొనసాగుతోంది. ఆదివారం జరిగిన రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ కాంస్య పోరులో ధీరజ్ బొమ్మదేవర, భజన్ కౌర్ ద్వయం.. 5-3తో మెక్సికన్ ఆర్చర్లు వలెన్సియ-గ్రాండెపై విజయం సాధించారు. పురుషుల వ్యక్తిగత రికర్వ్ ఈవెంట్‌లోనూ 22 ఏండ్ల ధీరజ్.. 7-3తో నెస్పొలి (ఇటలీ)పై గెలిచి కాంస్యం సాధించాడు. ఈ టోర్నీలో భారత్‌కు ఇది నాలుగో పతకం.

# బెల్జియం బోణీ

కొలొగ్నె: యూరో కప్‌లో బెల్జియం బోణీ కొట్టింది. ఆదివారం రొమానియాతో జరిగిన మ్యాచ్‌లో 2-0తో గెలిచింది. బెల్జియం తరఫున యూరి (2వ నిమిషంలో), కెవిన్ డి బ్ర్యూనె (80వ) రెండు గోల్స్ సాధించగా రొమానియా ఒక్క గోల్ కూడా కొట్టలేకపోయింది. బెల్జియం తమ తదుపరి మ్యాచ్‌లో ఉక్రెయిన్‌తో తలపడాల్సి ఉంది.

# కర్ణాటకలో మద్యం ధరల తగ్గింపు!

- ప్రముఖ బ్రాండ్లపై 12 నుంచి 15 శాతం తగ్గే అవకాశం
- సెమీ ప్రీమియం బ్రాండ్లపై కనీసం 10 శాతం తగ్గింపు
- తెలంగాణలో 15 నుంచి 25 శాతం పెంపునకు యత్నం
- త్వరలోనే విధి విధానాలు ప్రకటించే అవకాశం

హైదరాబాద్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, కర్ణాటకలో ఒకే పార్టీ అధికారంలో ఉన్నది. అయితే, ఆ రాష్ట్ర ప్రభుత్వం మద్యం ధరలను తగ్గించాలని చూస్తుంటే.. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఖజానాను నింపుకొనేందుకు మద్యం ధరలు పెంచేందుకు సమాయత్తం అవుతున్నట్టు తెలుస్తున్నది. జూలై 1 నుంచి ప్రీమియం మద్యం బ్రాండ్ల ధరలను తగ్గించేందుకు కర్ణాటక ప్రభుత్వం సిద్ధమైంది. ఈ తగ్గింపు 10 శాతం వరకు ఉండనున్నట్టు సమాచారం. ప్రీమియం విదేశీ బ్రాండ్ల ధరలనూ 12 నుంచి 15 శాతం తగ్గించే అవకాశం ఉన్నది. ఎక్సైజ్ ఆదాయాన్ని పెంచటం, రాష్ట్రంలోకి అక్రమంగా వస్తున్న మద్యం రవాణాను అరికట్టడమే లక్ష్యంగా ధరలను తగ్గించేందుకు అక్కడి ప్రభుత్వం సిద్ధమైంది. ధరల తగ్గింపుపై అభ్యంతరాల కోసం ఏడు రోజుల గడువు ఇస్తూ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు.



### తెలంగాణలో 15 నుంచి 25 శాతం పెంపు?

తెలంగాణ ప్రభుత్వం అన్ని బ్రాండ్ల లిక్కర్ ధరల మీద 15 నుంచి 20-25 శాతం వరకు పెంచే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. మద్యం ద్వారా ఎక్కువ ఆదాయాన్ని పొందేందుకే నిర్ణయం తీసుకుంటున్నట్టు సమాచారం. ధరలు పెంచితే ఏటా సర్కారుకు అదనంగా రూ.3 వేల నుంచి 3.5వేల కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరే అవకా శం ఉన్నది. ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పడిన మంత్రివర్గం ఉపసంఘం ఇటీవలే సమావేశమైంది. ఏయే శాఖల నుంచి అదనంగా నిధుల సమీకరణ చేయొచ్చని చర్చ జరిగిందని, మద్యం రేట్ల పెంపు అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. అయితే, తక్షణమే పెంచుతారా? లేదా ? అనే దానిపై స్పష్టత రాలేదు. పెంపుపై త్వరలోనే విధివిధానాలను ఖరారు చేస్తారని తెలిసింది. ఒకే పార్టీకి చెందిన రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు.. ఒకచోట మద్యం ధరలు తగ్గిస్తుంటే, మరోచోట పెంచటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# 200 ఎకరాల్లో ఏఐ సిటీ

- ఔటర్ పక్కన భూముల గుర్తింపు
- గ్లోబల్ ఏఐ సమ్మిట్‌కు ముందే శంకుస్థాపనకు ప్రణాళికలు

హైదరాబాద్, జూన్ 23(నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సిటీ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నది. సుమారు 200 ఎకరాల్లో ఏఐ సిటీ ఏర్పాటు చేయనున్నట్టు సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. మహేశ్వరం, శేరిలింగంపల్లి, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో ఔటర్ పక్కన ప్రభుత్వ భూములు గుర్తించినట్టు అధికావర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం జూలైలో హైదరాబాద్‌లో గ్లోబల్ ఏఐ సమ్మిట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ సమ్మిట్‌కు ముందే ఏఐ సిటీకి శంకుస్థాపన చేయాలని భావిస్తున్నది. తద్వారా సదస్సుకు హాజరయ్యే వివిధ కంపెనీల ప్రతినిధులకు ఏఐ సిటీని ప్రత్యక్షంగా చూపించే అవకాశం కలుగుతుందనేది ప్రభుత్వ ఉద్దేశంగా ఉన్నది. ఏఐ సిటీకి సమీపంలోనే స్కిల్ యూనివర్సిటీని కూడా నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్నది.




ORANGE AUTO: Attapur: 9167473372, Erragadda: 7506025174, Medchal: 8291244717, Kharkana: 7506025493, Medak: 9619938527.
SELECT CARS: Nagole: 7506025176, Chandanagar: 7506025180, Begumpet: 7506025220, Bachupally: 9167413840, Karmanghat: 9619083948.
JASPER INDUSTRIES: SD Road, Secunderabad: 9619024718, Narsingi: 8879152707, Chandrayangutta: 9167450755, Kompally: 9619973314.
TEJASWI AUTOMOBILES: Hi Tech City, Madhapur: 7506025271, Sangareddy: 8879187409, Siddipet: 8879187436, Zaheerabad: 8879194145, Tolichowki: 8879186915.
PRATHAMMALIK AUTOMATRIX: Banjara Hills: 8291058022, Boduppal: 9000979494, Financial District (Near Q City): 9167090503.
MALIK CARS: Malakpet: 7506025166, Himayathnagar: 7506025158, Bowenpally: 7506025486.
VENKATARAMANA MOTORS: Gachibowli, Shankarpally: 7506025311, Ecil, Kushaiguda: 7506025339, Vanastalipuram: 7506025358, Jubilee Hills: 8879334329, Kukatpally: 8879221046.
Service: Kondapur, ECIL, Tolichowki, Bowenpally, Hi-tech City, Sangareddy, Zaheerabad, Siddipet, Sanathnagar, Uppal, Kompally, Tadbund, Secunderabad, Hafeezpet.

Ex-showroom price New Nexon Smart(O) MT, New Delhi. *Tata Nexon has scored highest adult occupant scores per test conducted by GNCAP in the category of SUV less than 4 meter in length & engine less than 1.5L SUV as per GNCAP test result. #Tata Nexon is highest selling SUV from April'21 cumulative sales as per SIAM data. **7 in 7 celebration offer varies on select models & valid till 30th June only. Accessories shown and features mentioned may not be a part of standard equipment and are subject to change without prior notice. Actual colour of the vehicle and upholstery might differ. Tinted glass and number plates shown are for creative visualisation. T&C apply.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.